
టూరిస్ట్ టాక్సీ చాలా హాయిగా, మెత్తగా సాగి పోతున్నది నేషనల్ హై వే మీద. మరి కాస్త పొద్దెక్కితే ఆవులూ, గేదెలూ అడ్డు వస్తాయని - తెల తెల వారుతూంటేనే బయలుదేరారు మద్రాసు నుంచి. వెనక సీట్లో శ్యామలా, సావిత్రీ, సావిత్రి పక్కన ఆమె భర్త మూర్తి కూచుని వున్నారు. ముందు సీట్లో శర్మగారు కూచున్నారు.




శర్మగారూ శ్యామలా స్టేట్సు నుంచి యిండియాకొచ్చి ఆరు నెలలయింది. ఆయన యింకా ఏ వుద్యోగంలోనూ స్థిరపడలేదు. పిల్లలు పెద్ద వాళ్లయ్యారు. ఏ బాదర బందీ లేదు. పదిహేనేళ్లపాటు అమెరికాలో వుండి, బాగా రెండు చేతులా సంపాయించి, స్వదేశం మీద ప్రేమతో యిండియాకి తిరిగి వచ్చేశారు. మూర్తీ వాళ్ళ భారతదేశపు ఎల్లలు దాట లేదుగాని, వూళ్ళు తిరగడం అంటే యిష్టం. పిల్లలు లేని జంట. తిరువన్నామలై, పాండిచ్చేరి రెండు ఆశ్రమాలూ కలిపి ఒకే ట్రిప్‌లో చూసిరావాలని బయలుదేరారు ఈ నలుగురూ.

కారు కుదుపు లేకుండా హాయిగా వెళ్లి పోతున్నది.

"ఈ తమిళనాడులో రోడ్లూ, ప్రయాణమూ చాలా సుఖంగా వున్నాయండి" అన్నారు శర్మగారు యింపోర్టెడ్ సిగరెట్ ముట్టిస్తూ. ఆయన పెద్ద అట్టపెట్టె నిండా సిగరెట్లు తెచ్చుకున్నాడు స్టేట్స్ నుంచి.

"మీ అమెరికా కంటేనా?" అంది సావిత్రి నవ్వుతూ.

"అమెరికా మాది కాదు - మాది యిండియా అండీ" కంచు గ్లాసు దొర్లించినట్లు గలగల నవ్వారు శర్మగారు. ఆయన నవ్వు వినటం సావిత్రికి చాలా యిష్టం. మనస్ఫూర్తిగా వూపిరితిత్తుల నిండా గాలి పీల్చుకుని మరీ నవ్వుతారు.

"మూర్తిగారూ కడుపులో ఎలకలు పరుగు పెడుతున్నాయి. ఎక్కడేనా ఆపి..." ఆగిపోయాడు భార్య వంక భయపడుతున్నట్లు చూస్తూ. అది నిజమైన భయం కానే కాదు. ఆ దంపతుల్తో పరిచయం వున్న అందరికీ ఆ విషయం తెలుసు. కాని శర్మ గారు మటుకు 'నాకు మా ఆవిడంటే చాలా భయం-' అని అంటూంటారు ఫ్రెండ్స్‌తో.

"మనం తింటానికి ఏమన్నా తెచ్చుకుని వుండాల్సింది... వేరుశనక్కాయలూ..."

"ఇంత పొద్దుటే వేరుశనక్కాయలేమిటండీ? వేళాపాళా లేని తిండి మీద...? మందలిస్తున్నారు శ్యామల గారు భర్తని.

"ఏవయ్యా డ్రయివరూ - మంచి హోటళ్లేం తగలవా?" అడిగారు మూర్తిగారు వెనక నుంచి.

"మరో గంటలో విల్లిపురం తగుల్తుంది సార్. అక్కడ వేడి వేడి కాఫీ, మంచి యిడ్లీ దొరుకుతాయి. టూరిస్టులంతా అక్కడే బ్రేక్‌ఫాస్ట్ చేస్తారు" అన్నాడు డ్రయివర్.

"కారప్పొడి - నూనె వేసి యిడ్లీలు పెడతారా?" అడిగారు శర్మగారు.

"ఇదిగో తిండి తప్ప మీకు వేరు ధ్యాస లేదు కదా! చుట్టూ చూడండి పచ్చటి పొలాలు -" ఆగిపోయింది శ్యామల.

నిజానికి రోడ్డుకి రెండు వైపులా పొలాలు లేవు. అంతా ఎండిపోయి బోసిగా వుంది.

"ఈ వైపున - వరి పంట ఎక్కువగా వెయ్యరా?" అడిగింది శ్యామల.

"వెయ్యకేం? వేసంగి కదండీ - నీళ్ళ వసతి అట్టే లేదనుకుంటా. మీరు అమెరికా చూసిన కళ్లతో - మన ప్రాంతాల్ని చూడకూడదు" అంది సావిత్రి.

"మనం అల్లా అనుకునే వెనకబడి పోతున్నామండి. అమెరికాలో ఒక్క బొట్టు నీరు వృధా పోనివ్వరు. మన దేశంలో నదులు పొంగి పోవడం, వరదలూ, వుప్పెనలూ మనకి సరి అయిన ప్లానింగ్ లేదండీ..." ఎత్తుకున్నారు శర్మగారు.

ఆయనది నీరు పెట్టే సబ్జక్టు. నీళ్ళ గురించి ప్రపంచంలోని నీటి కరువు గురించీ గంటలు గంటలు లెక్చరివ్వగలరు.

"ప్రపంచంలోని నీటిలో తొంభై అయిదు శాతం సముద్రాల్లో వుప్పు నీరు... తాగడానికి వీలు లేకుండా వుంది - తెలుసా?..." అడుగుతున్నారు - మీ యింట్లో ఫలానా మ్యూజిక్ టేప్ వుందా లేదా అన్నట్టు.

"అవునట. ఈ మధ్య నెక్కడో చదివాను ఒక శాతం మంచూ, మిగతా నీళ్ళలో సగం నదులూ సరస్సుల్లో వుంటే, మిగతాది కాస్త పాతాళంలో వుండి పోయిందట..." అన్నారు మూర్తి గారు.

"అంచేత ఈ చుట్టుపక్కల నీళ్లు లేవన్న మాట. ఇన్ని రోజుల నుంచి మాకు పంపుల్లో నీళ్ళు రాకపోతే ఎందుకో అనుకున్నాను. అదా అసలు సంగతి" సావిత్రి విడిపిస్తున్నట్లు మొగుడి వంక చూస్తూ అంది.

"నేను కె.యల్.రావుగారి కలలని నిజం చేస్తానండి. అసలు యిండియాకి రావడానికి యిది కూడా ఒక కారణం. టెన్నెసీ వారి ప్రాజెక్టులలాగా మనం కూడా గంగ నుంచి కావేరీ దాకా గార్లెండ్ ఆఫ్ రివర్స్ ... శర్మగారి మాటలు యింకా పూర్తి కాకుండానే, కారు స్లో అయింది. ఏదో వూరి పొలిమేర్లకి వచ్చారు - రోడ్డు పక్కన యిటూ అటూ షాపులు, పళ్ళ దుకాణాలు. డ్రయివర్ కారుని రోడ్ పక్కగా, హోటల్ గుమ్మంకి కాస్త ముందుగా ఆపాడు.

"లోపల కొస్తారా సార్? ఇక్కడికే తెప్పించమంటారా?"

మొగవాళ్లిద్దరూ మంచి వాదోపవాదాల్లో వున్నారు. గంగా కావేరీ నీళ్ళు కలపడం పగటి కల అంటున్నారు మూర్తిగారు. అది ఎలా సాధ్యమవుతుందో సాధ్యపడగలదో చెప్పిలా కాయితం తీసుకుని, వాటర్ వేస్ ఎలా రావచ్చో గబగబా స్కెచ్ వేసి చూపిస్తున్నారు శర్మగారు.

"ఇక్కడే కూచుని తింటాం. ముందుగా పొడి మాటుకు మర్చిపోకు" శర్మగారు హెచ్చరించారు డ్రయివర్‌ని.

అతను దిగి ప్లేట్లు పట్టించుకొచ్చాడు. 'షోడాలు కావాలా, కూల్ డ్రింకులా' అంటూ అడిగే పిల్లలూ, 'బాబూ ధర్మం' అంటూ చేతులు జాపే బిచ్చగాళ్ళూనూ. డ్రయివర్ పక్క సీట్లో కూచున్న శర్మగారు వాళ్ళని కసిరికొడుతున్నారు. చుట్టూ యింతమంది అన్నార్తులు చేతులు చాపుతుంటే, ప్లేట్లల్లో యిడ్డెన్లు పెట్టుకు తింటం ఫ్రీలకి యిబ్బందిగానే వుంది. టిఫిన్‌లు తిన్నారు. వేడివేడి కాఫీ తీసుకొచ్చి యిచ్చాడు హోటల్ కుర్రాడు.

శర్మగారు దాక్షిణాత్యుల కాఫీని మెచ్చుకుంటూ రెండు గుటకలు వేశారు. కారు కిటికీలోంచి 'సామీ ధర్మం - సామీ ధర్మం' అంటూ తెల్లగుడ్డ కట్టుకున్న చెయ్యి లోపలికి జాపి అడుగుతున్నాడు బిచ్చగాడు.

"వెళ్లమంటుంటే - ఫో - ధర్మం లేదు - గిర్మం లేదు వెధవా, మొద్దులాగా వున్నావు" అరుస్తున్నారు శర్మగారు - ఆయన ముఖం ఎర్రగా కందగడ్డలా అవుతోంది చికాకులో.

"మారాజా - పది పైసలు యిప్పించండి సామీ" గుడ్డ కట్టుకున్న అరి చెయ్యి కారు లోపలికి దూర్చి అడుగుతున్నాడు బిచ్చగాడు. కన్ను తెరిచి మూసే లోపల



జరిగిపోయింది.

బిచ్చగాడు వెర్రి కేక పెట్టడం - ఆ పక్క సల్పుని టీ తాగుతున్న డ్రయివర్ పరుగెత్తుకొచ్చి - గభాలున కారు స్టార్టు చెయ్యడం, రెప్పపాటులో జరిగిపోయింది.

'ఏం జరిగింది? ఏం జరిగింది?' అని ఆశ్చర్యపోయి తల ఎత్తి చూస్తున్నారు స్త్రీలిద్దరూ.

"రాస్కెల్స్ ... డర్టీ బెగ్గర్స్-" తిడుతున్నారు శర్మగారు.

"త్వరగా - డోరు మూయ్యండమ్మా ... గుంపు కూడకముందే వెళ్లిపోదాం" డ్రయివర్ కారు కదుల్తుంటే తలుపులు మూసేశాడు.

"గ్లాసులో?"

"ఫరవాలేదమ్మా - వచ్చేప్పుడు యిచ్చేద్దాం - ఇక్కడ యింకా వుంటే డేంజరు..."

"మీకు కోపంలో వొళ్లు తెలియదు. వాడేమయినా అయితే ..." అంటోంది శ్యామల గారు.

"వెధవ - డర్టీ రోగ్ - ఆ కుష్టు చెయ్యి నాకు అంటిస్తాడా? బుద్ధి చెప్పాను - మళ్లీ ఎప్పుడూ అలాంటి పని చెయ్యడు ..." ఆయన కోపం యింకా రాజుకుంటున్నదే తప్ప, ఆగడం లేదు.

సావిత్రికి ఆశ్చర్యంగా వుంది. నాగరికుడు చదువుకున్నవాడు అయిన ఒక మనిషికి యింత కోపం వస్తుందా? వచ్చినా వేడి వేడి కాఫీ ఆ ముష్టి వాడి ముఖం మీద ఎలా విసిరికొట్టగలిగాడు? ఆ వేడి వేడి కాఫీతో వాడి కళ్లు పోతే! సావిత్రి వెనక్కి తిరిగి చూసింది అద్దంలోంచి. రోడ్డు మీద జనం గుంపు గుంపుగా కారు వైపుగా పరుగెట్టు కొస్తున్నారు. కొందరు వొంగి నేల మీదకు చూస్తున్నారు. బహుశా ఆ ముసిలి వాడు రోడ్డు మీద పడిపోయి గిలగిల కొట్టుకుంటున్నాడేమో!

సావిత్రికి ఏం మాట్లాడాలని అనిపించలేదు. శర్మగారు యింకా కోపంగానే వున్నారు. ఆయన తాను చేసిన పనికి విచారించడం లేదు. తాను తొందర పడ్డానని అనుకుంటున్నట్లు లేదు.

"ఈ బిచ్చగాళ్లతో యిదే సార్ న్యూసెన్స్. ఫారెనర్స్‌ని కూడా యిలాగే పీక్కు తింటూంటారు" డ్రయివర్ వూరి పొలిమేరలు దాటాక కాస్త స్థిమిత పడి మాటలు మొదలు పెట్టాడు.

"వీళ్లందర్నీ పట్టుకు పోయి జైల్లో పెట్టాలి. అప్పుడు గాని మన దేశం బాగుపడదు" అంటున్నారు శర్మగారు.

సావిత్రి భర్త వంక చూసింది. అతను కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు. తనకేం సంబంధం లేనట్లు!

"అలా వేడి కాఫీ వాడి మొహం మీద కొట్టడం అన్యాయం కాదా? కావాలంటే పోలీసులకి అప్పచెప్పాల్సింది" సావిత్రి వూరుకోలేక పైకి అనేసింది.

"ఇంతోటి బెగ్గర్ వెధవకి పోలీసు లెందుకండీ. బహుశా ఆ ముఖం మీద పడ్డ కాఫీ కూడా వాడు నాకేసి వుంటాడు కుక్కలాగా" గలగల నవ్వుతూ అన్నాడు శర్మగారు.

ఆ క్షణంలో శర్మగారు సావిత్రి దృష్టిలో చాలా కిందకి పడిపోయాడు. "ఛీ, ఏం మనిషి? ఇటువంటి హృదయం లేని మనుషుల్తో తాము ప్రయాణం చెయ్యాలి కాబోలు. మూడు రోజులు - ఎలా గడుస్తాయో?" అనుకుంది మనసులో.

"మీకు అనేక సార్లు చెప్పాను. వొళ్ళు తెలియని కోపం కూడదని. డ్రయివర్ గబుక్కున కారు స్టార్టు చేశాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఆ రోడ్డు మీద నలుగురూ కూడి గొడవ చేసి వుంటే ..." అంది శ్యామల.

"ఏడిశారు. వాళ్లకంత ధైర్యం ఎక్కడుంటుంది? మరీ అయితే ఒక పది రూపాయిలు మొహాన విసిరేద్దును. మరోసారి కాఫీ పోసినా వూరుకుంటారు" నిర్లక్ష్యంగా సిగరెట్ ముట్టిస్తూ అన్నారు శర్మగారు.

శ్యామల భర్తతో ఏకీభవించనట్లు కాస్త సిగ్గుపడుతూ సావిత్రి వంక చూసింది.

* * *

ముష్టివాడి సంఘటన కొద్ది కొద్దిగా మరుగున పడిపోయింది. తిరువన్నామలైలో రమణాశ్రమాన్ని చూశారు. శర్మగారు నేల మీద కూచుని కుట్టుడాకుల్లో భోజనం చేసి 'ఇక్కడ వాతావరణం చాలా బాగుంది. ఇక్కడే స్థిరపడిపోతాను' అని మొదలు పెట్టారు. పాండుచ్చేరిలో కూడా ఆయన మనసు వూగిసలాడడం మొదలుపెట్టింది హామ్‌లెట్‌లాగా! 'రివర్ ప్రాజెక్టులు వద్దు. గంగనూ, కావేరినీ కలపడం నాకు సాధ్యం కాదు; హాయిగా అరవిందాశ్రమలో వుండిపోతాను" అన్నారు.

ఈయన మనసు సాదరసంగాలాగా యిటూ అటూ పరుగు పెడుతూంది. ఒక్కచోట స్థిరంగా నిలవదు అనుకుంది సావిత్రి ఆయన మాటలు విని.

పాండుచ్చేరిలో మూడు గంటల వేళ బయలుదేరారు. వాతావరణం కాస్త చల్లబడింది. జూన్ మొదటి వారం అక్కడా అక్కడా వుండీ లేనట్లు తొలకరి జల్లులు. మూడు రోజుల ఉత్సాహం, ఖబుర్లూ అన్నీ యింకిపోయాయి. శ్యామలకి తలనెప్పి; సావిత్రికి కారులో కూచుని కూచుని రెండు కాళ్ళూ నాచాయి. ఎప్పుడెప్పుడు మద్రాసు చేరుకుని, హాయిగా స్నానాలుచేసి విశ్రాంతి తీసుకుందామా అని ఆతృత పడుతున్నారు. డ్రయివర్ యూనిఫారమ్ స్పీడులో కారు నడుపుతున్నాడు. సాయంకాలపు చల్లగాలి మందంగా, తొలి వర్షపు సౌరభాన్ని మోసుకు వస్తోంది. కాఫీలకి కూడా ఎవరికీ ఆగాలని లేదు. మధ్యాహ్నం టీ తాగి మరీ బయలుదేరారు.

శర్మగారు 'అప్పన్నా తన్నా మన్నా' అని పాడుకున్నారు తనలో తాను. ఊరు మధ్య నుంచి టాక్సీ మెత్తగా జారుకుంటూ వెళ్తోంది. ఆవుల మందకీ, మేకలకీ హారన్ వేసినట్టు డ్రయివర్ మనుష్యులని తప్పుకోమని హారన్ వేస్తూ కారు స్లో చేసి, హోటల్ ముందున్న పిల్లవాడికి ఖాళీ గ్లాసులు అందించాడు. కారులో కూచున్న నలుగురికీ మూడు రోజుల క్రితం సంఘటన జ్ఞాపకం వచ్చింది. అందరూ చుట్టూ చూశారు. బిచ్చగాళ్ళు ఎవరూ కారు దగ్గరకు రాలేదు.

"ఏమండీ సావిత్రి గారూ- మొన్న బాగా బుద్ధిచెప్పాను చూశారా! దేనికైనా ధైర్యం వుండాలండీ. అడుక్కుతినే వెధవల గురించి మీరు పెద్ద బాధ పడిపోయారు. ఈ రోజుఒక్క వెధవ కూడా ఈ ఛాయలకు రాలేదు" శర్మగారు విజయగర్వంతో నవ్వుతున్నారు.



చిత్రం : వెల్లటూరి పూర్ణానంద శర్మ

సావిత్రి తన భయానికి తానే సిగ్గు పడింది.

కారు వూరు చివరకొచ్చేసింది. శివార్లు దాటుతున్నారు. రోడ్డు మీద పెద్ద గుంపు.

"యాక్సిడెంట్ కాబోలు. ఫామిలీతో వెళ్తున్నాము. అవసర్లేదు. పక్కనించి తీసుకెళ్ళిపో" హెచ్చరించారు మూర్తిగారు.

డ్రయివర్ కారుని రోడ్ పక్కగా స్లో చేసి తీసుకెళ్ళబోయాడు. గుంపు కదలలేదు. కారుకి దారివ్వలేదు. కారుకి అడ్డంగా నిల్చున్నారు. చుట్టూ చేరిన గుంపుని చూసి తడబడ్డాడు డ్రయివర్. సడన్ బ్రేక్ వేశాడు.

"కారు ఆపు. కదిలావా చితకకొట్టేస్తాము" వాళ్ళ కంఠాలు మోటుగా వున్నాయి. చేతుల్లో కర్రలు.

దేనికి? నగలా? డబ్బా! దొంగలా? లేక ఎవరికైనా ప్రమాదమా? లక్ష ప్రశ్నలు.

"దేనికి ఆపారు? ఎవరు మీరు?" శర్మగారు కీచుగా అడుగుతున్నారు.

"దిగు- దిగమంటే" కారు తలుపు తెరిచి రెక్క పట్టుకు లాగుతున్నారు.

వెనక సీట్లోంచి శ్యామల గారు కెవ్వుమంది.


"దిగవయ్యా- పద" ఇంచుమించు ఈడ్చినట్లు లాగుతున్నారు.

వెనక సీట్లోంచి తలుపు తెరిచారు. మూర్తి గారు బయటకొచ్చారు.

"ఏం కావాలి?"

"ముందు బయటకి రండి- కారు దిగండి"

'దిగను' అనే సాటి ధైర్యం ఎవరికీ లేదు. చుట్టూ ఆడా మొగా వంద మంది దాకా




వున్నారు.

"ఆయన్నెక్కడ్నే పంపకండి" మధ్యలో ఆగిపోయింది శ్యామల గారి కంఠం.

"అమ్మా, మీతో మాకేం పని లేదు. ఈ పెద్ద మనిషితోనే.."

"దేనికి?"

"పదవయ్యా. మాట్లాడకు. పదు." ఇంచుమించు తోసుకుంటూ తీసుకెళ్ళారు. చుట్టూ చీకట్లు అల్లుకుంటున్నాయి. కాళ్ళ నెప్పులూ, తలనెప్పులూ మర్చిపోయారు. పొలాలకి అడ్డంగా నడిపించుకు తీసుకుపోతున్నారు. వలుగురినీ ఏం చేస్తారు? చంపుతారా? చీకటి మాటున పాడుస్తారా?

"మమ్మల్నెక్కడికి తీసుకెడుతున్నారు? పోలీసు రిపోర్ట్ ఇస్తాను. జాగ్రత్త" శర్మగారు గట్టిగా అరుస్తున్నారు.

"పోవయ్యా- ఈ చీకట్లో నిన్ను తన్ని పూడ్చినా ఎవరూ అడగరు. నోరెత్తకుండా పదు..."

దూరాన గుంపుగా పాకలు. ఒక పాక ముందు చెట్టుకింద చాప. ఆ చాప మీద ఒక మనిషి.

చూడు- చూడు. ఎవరు పడుకున్నారో చూడు. శర్మగారి మెడ మీద చెయ్యేసి వొంచుతున్నాడొక మనిషి.

శ్యామల గారు కెవ్వుమంది.

"తాతా! ఎవరొచ్చారో చూడు... ఆ మనిషిని పట్టుకొచ్చాం. తన్నమన్నావా చెప్పు" అడుగుతున్నాడు మరో మనిషి.

తాత మాట్లాడే స్థితిలో లేదు. చీకట్లో ఆ మనిషెవరో గుర్తు తెలియడం లేదు శర్మగారికి. ఆ మనిషి ముఖం వుబ్బి వుంది.

"ఎవరూ?- ఈ మనిషెవరో నాకు తెలియదు." శర్మ గారి కంఠంలో భయం.

"ఎవరో తెలియదూ? మొఖం మీద వేడి కాఫీ పోశావే.. నీ మొహం మీద కూడా పొయ్యనా? ఒరేయ్ మసిలే నీళ్ళు తెండిరా పోద్దాం... అప్పుడు తెలుస్తుంది.."

శ్యామలగారు గబుక్కున భర్త పక్కకొచ్చింది. "బాబూ! అట్లాంటి పని చెయ్యకు" అంటోంది.

"కాఫీ పోసినపుడు నీ మొగుడికి చెప్పకోకపోయావా? అప్పుడేమయింది నీ తెలివి?"

"ఒరేయ్ ఆ ఆడమనిషిని ఏదన్నా అంటే వూరుకోను..." గుంపులోంచి ఎవరిదో ఆడ కంఠం.

'ఇంతకీ మీకేం కావాలి? డబ్బా? ఇస్తాను- మమ్మల్ని పోనివ్వండి"

"ఆ సంగతి తాత చెడుగు..."

"మీరే అడగండి. నాకు అవసరం లేదు. ముష్టి వెధవని నేను అడగను" శర్మగారి మీదకి పక్క మనిషి కర్ర ఎత్తాడు కొట్టబోతున్నట్టు..

"మీరు వుండండి శర్మగారూ! జరిగిందానికి నేను క్షమార్పణ చెప్పకుంటున్నాను. మమ్మల్ని వెళ్ళనివ్వండి" అన్నారు మూర్తిగారు.

"ఈ తాతని మీతో తీసుకెళ్ళి వైద్యం చేయించండి" అంటున్నాడు కర్ర బుచ్చుకు మన్నున్న మనిషి.

మూర్తిగారు నిర్ఘాంతపోయారు. వాళ్ళు ఇలాంటిది కోరతారని అనుకోలేదు.

అది సాధ్యమా?

"కావాలంటే డబ్బు పారేస్తాను. అంతే గాని" శర్మగారు గట్టిగా అరుస్తున్నారు. ఆ బహిరంగ ప్రదేశంలో ఆయన అరుపు గాలిలో కలిసిపోయింది.


దీపావళి శుభాకాంక్షలతో...

ఉత్తమ శిక్షణ పొందగోరే విద్యార్థినీ, విద్యార్థులకు నిలయాలు

Phones: Off :34678 Res:32383

ప్రగతి రెసిడెన్షియల్ కళాశాల

శ్యామలానగర్, గుంటూరు-6

ఇంటర్మీడియట్ లో చేరే విద్యార్థులకి ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో Bi.P.C, M.P.C, M.E.C, C.E.C కోర్సులు కలవు.

డైరెక్టర్

గంగినేని వెంకటేశ్వరరావు M.Sc.,

Phones: Off :30433 Res:32383

ప్రగతి మహిళా రెసిడెన్షియల్ కాలేజి

I వ లైను, చంద్రమౌళి నగర్, గుంటూరు-7

ఇంటర్మీడియట్ లో చేరే విద్యార్థినిలకు ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో Bi.P.C, M.P.C, M.E.C, C.E.C కోర్సులు కలవు.

డైరెక్టర్

గంగినేని వెంకటేశ్వరరావు M.Sc.,

EYE ADS



"బాబూ! వాళ్ళు చిన్నవాళ్ళు. నాకు వైద్యమూ వొద్దు, డబ్బూ వొద్దు. వారేయ్ వారిని పంపించెయ్యండిరా" తాత కంఠం నీరసంగా వుంది.

మల్లున్న శర్మగారు క్షణం పాటు యిటూ అటూ కదిలారు. జేబులోంచి మళ్లీ పర్సు తియ్యబోతున్నారు.

"బాబూ నేను డబ్బేం చేసుకుంటాను? వొద్దు..."

"నాతోరా. ఆస్పత్రిలో చేరిపిస్తా"

"వద్దండి. ముసలి వాడిని. ఇంకా మందూ మాకూ ఎందుకండి?"

"మరి మమ్మల్నెందుకు పట్టుకొచ్చారు?"

"మీకు బుద్ధి చెప్పడానికి. మేమూ మనుషులమే.. మీలాంటి రాక్షసులం కాదని చెప్పడానికి..." ఎవరో జవాబు చెప్పారు.

శర్మ గారికి ఎలానో వుంది. పర్సు మీదకి మళ్ళీ చెయ్యి పోయింది.

"మాకు డబ్బులొద్దండి."

బిచ్చమెత్తుకుంటూ 'ధర్మం బాబూ' అని పీడించే వీళ్ళకి డబ్బులు నిజంగానే వొద్దా!

ఏం చెయ్యాలి?

"మనం వెళ్దామా?" కదలబోయారు మూర్తిగారు.

"బాబూ నా మనవడు. వాడికి దిక్కు లేదండి. మీతో తీసుకెళ్ళి స్కూల్లో చేర్పించండి" తాత వేడుకుంటున్నాడు.

"నాతోనా? ఏం చేసుకోను! పోనీ అనాథాశ్రమంలో చేర్పించనా?" అడిగారు శర్మగారు.

"అల్లాగే చెయ్యండి. ఇక్కడుండి వాడూ నాలాగే ముష్టివాడయి మీలాంటి మారాజుల చేత ఉమ్మించుకోకూడదు..."

శర్మగారు అవాక్కయిపోయారు. ఆ చిరు చీకట్లో చాప మీద పడుకున్న ముష్టివాడి ముఖాన్ని మరోసారి చూడాలని ప్రయత్నించారు. కాని ఆయన కళ్ళు మసగలు కమ్మాయి.

* * * *

కారులో మూలగా నక్కి కూచున్న ఆరేళ్ళ పిల్లవాడిని చూస్తున్నారు శ్యామలా, సావిత్రి. పిల్లవాడు ముష్టివాడిలా దుమ్ముకొట్టుకుని లేడు. బట్టలుచినిగినా శుభ్రంగా వున్నాయి. భయంభయంగా చూస్తున్నాడు వాళ్ల వంక.

"నీ పేరేమిట్రా?" అడిగింది కారు కదిలాక గుండె దడ తగ్గి శ్యామల.

"మురుగేశన్ అంటారండి"

"మా కారు నీ కెట్లా తెలిసిందిరా?"

"ఈ రోడ్డు మీద పోయే కారు నంబర్లన్నీ నాకు తెలుసండి"

సావిత్రికి శర్మగారు ఈ పిల్లవాడిని ఏం చేస్తారో చూడాలని కుతూహలంగా వుంది. మద్రాసు పొలిమేరల్లోకి వచ్చాక వాడిని దిగిపొమ్మంటారా? అనాథాశ్రమంలో చేరుస్తారా?

"ఏమండి- ఆర్ఫనేజ్ కి ఫోన్ చెయ్యమంటారా?" అడిగింది సావిత్రి కుతూహలం ఆపుకోలేక- కారు తమ ఇంటి ముందు ఆగినపుడు!

"వొద్దు" అన్నారు రెండు అక్షరాల్లో. శర్మ దంపతుల్తో, మురుగేశన్‌తో కారు కదిలింది. ఆ క్షణాన ఆయన మీద మనస్ఫూర్తిగా అభిమానం కలిగింది సావిత్రికి. *

